# 17

# శ్రీవాణిగారి కథ

బస్టాప్‌లో నిలబడ్డారు పద్మ, సావిత్రి. వాళ్ళిద్దరూ ఒక గవర్నమెంట్ అండర్ టేకింగ్ సంస్థలో పనిచేస్తున్నారు. వాళ్ళ కంపెనీ బస్ రావాలి. ఎదురు చూస్తూ కబుర్లు చెప్పుకుంటున్నారు.

పద్మ హఠాత్తుగా మాటలు ఆపేసింది.

"ఆ వస్తుంది శ్రీవాణిగారు కదూ!" అంది.

"ఎక్కడ?" అడిగింది సావిత్రి.

"అదుగో నడుచుకుంటూ వస్తున్నారు" చెప్పింది పద్మ.

"ఛ. శ్రీవాణిగారు నడుస్తూ ఎందుకొస్తారు? కార్లో వస్తారుగానీ! ఎవర్ని చూసి ఎవరనుకున్నారో మీరు" అంది సావిత్రి.

"కాదు సావిత్రిగారూ అరుగో ఆవిడే" అంది పద్మ.

అంతలోనే దగ్గరకు వచ్చాక "నమస్తే మేడం" అంది పద్మ చేతులు జోడించి.

నవ్వుతూ ప్రతి నమస్కారం చేసి వెళ్ళిపోయింది శ్రీవాణి.

"అదేవిటలా ఉంది ఆవిడ?" అంది పద్మ.

"నిజమే. ఏమిటంత పేదగా ఉంది?" అంది సావిత్రి.

ఆశ్చర్యంగా ఆవిడ వెళ్ళిన వైపే చూస్తూ ఉండిపోయారిద్దరూ. బస్ వచ్చి హారన్ కొట్టేసరికి ఉలిక్కిపడి బస్ ఎక్కారు. బస్సులోనూ ఆవిడ గురించే మాట్లాడుకున్నారు.

శ్రీవాణిగారు చాలా మంచి వ్యక్తి. వృత్తి రీత్యా లాయరు. ఆవిడ భర్త రంగశాయి గారు ఇంజనీరింగ్ అయ్యాక డబుల్ పిహెచ్.డి. చేశారు. అమెరికా వెళ్ళి పదిహేనేళ్ళు ఉండి తిరిగి వచ్చి స్వంతంగా ఇండస్ట్రీ పెట్టుకున్నారు. వాళ్ళకి పిల్లలు లేరు.

శ్రీవాణిగారు తను కంపెనీలో లీగల్ వ్యవహారాలు చూస్తారు. సంఘసేవ చేస్తారు.

పద్మ వాళ్ళ కంపెనీలో మహిళాదినోత్సవం సందర్భంగా శ్రీవాణిని పిలిచారు. ఆవిడ వచ్చారు. మంచి ఒడ్డూ పొడుగూ చూడచక్కని రూపం. మెళ్ళో రెండు పేటల మంగళసూత్రాల గొలుసు నల్లపూసలు. చేతులనిండుగా బంగారు గాజులు రవ్వల దిద్దులు సింపుల్‌గా ఉన్న కంచిపట్టు చీర వీటన్నింటినీ మించిన చిరునవ్వు ఆ రూపం చూసి ముగ్ధులైన వారు ఆవిడ ఉపన్యాసం విని మరింత పరవశించారు.

"ప్రస్తుత సమాజంలో ఎంతోమంది స్త్రీలు డిప్రెషన్‌తో బాధపడుతున్నారు. అటువంటి వారు డాక్టర్ల చుట్టూ తిరక్కుండా ఉన్నంతలో ఆనందాన్ని వెతుక్కోవాలి. రోజులో కొంత సమయం ఇతరుల గురించి ఆలోచించండి. వారు మన బంధువులో, మిత్రులో కానవసరం లేదు. కంటి ఎదురుగా కనిపించే వారిని తీసుకోండి. వారికష్టం మీ కష్టంగా భావించి వారికి సహాయం చెయ్యండి.

"ఆ సహాయం వేలో లక్షలో కానవసరం లేదు. మనకే మాత్రం నష్టం కలిగించ కుండానే మనకెంతో మనశ్శాంతిని కలిగించే సాధనాలు ఎన్నో ఉన్నాయి.

"ఉదాహరణకి ఆ మధ్య నాకు ఒక అమ్మాయి కనిపించింది. పాతబట్టలకు స్టీలు సామానులు అమ్మడం ఆ అమ్మాయి వృత్తి. చేతిలో నెలల పసిబిడ్డవున్నాడు. వాడికి ఆ అమ్మాయి ఒక నైలాన్ చొక్కా తొడిగింది. ఎండమండిపోతోంది. గుక్క పెట్టి ఏడుస్తున్నాడు. నాకు జాలివేసింది. ఆ అమ్మాయిని రమ్మన్నాను.

"బట్టలు వేయండి అమ్మగారు అంది రాగానే. బట్టలు కాదులే నువ్వు అలా కూర్చో అని చెప్పి మిగిలిన అన్నం ఇంత మజ్జిగ పోసి తినమని చెప్పాను. ఆ అమ్మాయి అన్నం తినేలోగా ఇంట్లో ఉన్న పాత పంచె చింపి మిషను మీద నాలుగు జుబ్బాలు కుట్టాను. నైలాన్ చొక్కా విప్పి మెత్తని నూలు చొక్కా తొడిగేసరికి ఆ పసివాడి ఆనందం వర్ణనాతీతం. వాడిని చూసి వాడి తల్లి మురిపెం వర్ణనాతీతం. వాళ్ళిద్దరినీ చూస్తుంటే నాకు పట్టరాని ఆనందం కలిగింది.

"ఇటువంటి ఆనందం అప్పుడప్పుడు అనుభవిస్తూ వుంటే డిప్రెషన్ దగ్గరకు రాదు" అంటూ ఆవిడ ఉపన్యసిస్తుంటే కరతాళధ్వనులు మిన్నుముట్టాయి. ఫంక్షన్ అయ్యాక చాలామంది ఆవిడ ఆటోగ్రాఫ్ తీసుకున్నారు. వారిలో పద్మా, సావిత్రీ కూడా ఉన్నారు.

అటువంటి మనిషి ఇవ్వాళ వేలుముడి, పాతబడిపోయిన చీరె, మెళ్ళో మామూలు నల్లపూసల దండ, చేతికి మట్టిగాజులు మూసివాయనం ముత్తైదువులా వుంది. ఇంతలోనే ఏమైంది?

లంచ్ టైమ్‌కి మళ్ళీ అదే టాపిక్. వాళ్ళకి కొంచెం దూరంలో కూర్చుని వున్న సుజాత వాళ్ళ మాటలు విని గభాల్న లేచి వీళ్ళ దగ్గరికి వచ్చింది. ఆవిడది వేరే డిపార్ట్‌మెంట్. ముఖపరిచయం వుంది అంతే!

"ఎక్స్‌క్యూజ్‌మి ఎవరిగురించి మీరు మాట్లాడుకుంటున్నది?" కుతూహలంగా అడిగింది.

"కిందటి సంవత్సరం మార్చి నెల్లో విమెన్స్‌డేకి మన మీటింగ్‌కి వచ్చారు కదా శ్రీవాణిగారు ఆవిడ గురించి" చెప్పింది పద్మ.

"ఒక్క నిమిషం" అంటూ వెళ్ళి తన బాక్స్ తెచ్చుకుని వీళ్ళ దగ్గర కూర్చుంది సుజాత. "ఇప్పుడు చెప్పండి ఏమైంది?" అని అడిగింది.

చెప్పింది సావిత్రి.

"ఆవేళ ఫంక్షన్‌లో చూశారా ఎంత గ్రేస్‌ఫుల్‌గా ఉన్నారో. ఆ తర్వాత ఒకసారి టీ.వీ.లో చర్చా కార్యక్రమంలో కనిపించారు. ఎప్పుడు చూసినా మహాలక్ష్మిలా ఉండే ఆవిడ ఇవ్వాళ చాలా పేదగా కనిపించారు" అంది.

వంకరగా నవ్వింది సుజాత.

"ఆవిడ మాకు బంధువు అవుతుంది. మా వారికి వేలువిడిచిన మేనత్త కూతురు.

"వాళ్ళు అదోరకం మనుషులు. ఇక్కడ ఉద్యోగాలు వదులుకుని అమెరికా పోయారు. అక్కడ కాలు నిలవక మళ్ళీ తిరిగొచ్చారు. ఉద్యోగాల్లో చేరవచ్చు కదా. వద్దు మేమే పదిమందికి ఉద్యోగాలిస్తాం అని చర్లపల్లిలో ఒక ఇండస్ట్రీ పెట్టారు.

"పిల్లలు లేరు. ఎవరినైనా పెంచుకోండి అంటే వినలేదు. దేవుడే మాకు పిల్లలు లేకుండా చేసినప్పుడు మళ్ళీ ఈ పెంపకాలూ లంపటాలూ ఎందుకు? మా ఫ్యాక్టరీలో పనిచేసే వాళ్ళంతా మా పిల్లలే అంటారు.

"వంద సంపాదిస్తే అందులో తొంభై తొమ్మిది ఖర్చు పెట్టేదాకా తోచదు. దర్జాలకూ, ఖర్చులకూ ఏం తక్కువలేదు. హళ్ళికి హళ్ళి సున్నకు సున్నా. రేపనేది ఉందనే జాగర్త లేదు. తెలివితక్కువో, అతి తెలివో తెలియదు. ఎవరితోనూ కలవరు. వాళ్ళ లోకం వాళ్ళదే. మరేం ఎదురు దెబ్బ తగిలిందో ఏమో ఏ సంగతీ మా దాకా రాలేదు" అంటూ మాటలూ భోజనం ఒకేసారి ముగించి లేచి వెళ్ళిపోయింది సుజాత. ఆదరా బాదరా చేయి కడుక్కుని సెల్ తీసి భర్తకి ఈ సమాచారం అందించింది.

భార్య చెప్పింది విని ఆనందపడ్డాడు సూర్యం. మా బాగా అయింది. తిక్క కుదిరింది అనుకున్నాడు అతనంత ఆనందించడానికి కారణం ఉంది.

ఎప్పుడో ఏడేళ్ళ కిందట సూర్యానికి ఏదో ప్రాణావసరం వస్తే వెళ్ళి రంగశాయి గారిని సాయం అడిగాడు. ఆయన యాభైవేలు అప్పిచ్చి ఆదుకున్నాడు. అంతవరకూ బాగానే ఉంది. ఆయన దేవుడూ అని పొగిడారు. ఆ తర్వాత వాళ్ళు కొంచెం కుదుట పడ్డాక బాకీ తీర్చమనేసరికి గతుక్కుమన్నాడు సూర్యం.

తమలా గా ఆయన కూడా ఆ బాకీ విషయం మర్చిపోయాడని వాళ్ళనుకున్నారు. ఇదుగో ఇస్తాం అదుగో ఇస్తాం అని కొన్నాళ్ళు కాలయాపన చేశారు. ఇలా వాయిదాలు వేస్తే కొన్నాళ్ళకి విసుగేసి ఆయనే అడగడం మానేస్తాడులే అనుకున్నారు.

కానీ రంగశాయిగారు ఘటికుడు. "నువ్వు మనిషివా? పశువ్వా? కడుపుకి అన్నం తింటున్నావా గడ్డి తింటున్నావా?" అని తిట్టి గోళ్ళూడగొట్టి మరీ వసూలు చేశాడు. చెప్పొద్దూ సూర్యానికి చాలా కష్టం కలిగింది. "ఆ రంగశాయిగారికేం మాయరోగం. పిల్లా? పాపా? కట్టుకుపోతాడా? అయినవారిని అవసరంలో ఆదుకుంటే ఆ డబ్బు అణాపైసలతో వసూలు చెయ్యాలా?" అని అడిగినవాడికి అడగనివాడికి చెప్పుకుని తన అక్కసు తీర్చుకున్నాడు.

ఇప్పుడు ఆ రంగశాయిగారికి ఏదో నష్టం వచ్చిందనీ ఆయన భార్య అతిపేదగా కాలినడకన నడుస్తోందనీ భార్య ద్వారా తెలుసుకునేసరికి చెప్పరానంత సంబరం వేసింది. ఆ ఆనందం తనతోటి వాళ్ళతో పంచుకోవాలనిపించింది.

వెంటనే ఫోన్లు చేసి నలుగురైదుగురు బంధువులకి చెప్పేశాడు. ఆనోటా ఆనోటా పడి చాలా దూరం పాకిపోయింది ఈ వార్త.

చాలామందికి చర్చనీయాంశంగా మారింది.

"అంతేనమ్మా! ఆ మధ్య మా వాడికి వాళ్ళ దగ్గరికి పంపాం. ఏదో పెద్ద స్వంత ఫ్యాక్టరీ ఉందని గొప్ప చెప్పుకుంటారు కదా! అయినవాళ్ళు. చుట్టాల పిల్లాడికి ఉద్యోగం ఇప్పించకపోతారా అని ఆశపడి వాడు వెళ్ళనంటున్నా బలవంతపెట్టి పంపించాం. వాడు బంగారంలాంటి కుర్రాడు. ఏదో పరీక్షలకి ముందు జ్వరం వచ్చి పదోతరగతి తప్పాడు గానీ కలెక్టరో గవర్నరో కావలసిన తెలివితేటలున్నాయి వాడికి. అటువంటి కుర్రాడిని తీసుకెళ్ళి లారీలోంచి సరుకుదింపించే ఉద్యోగం ఇచ్చారుట. వాడికసలే డస్ట్ అలెర్జీ. ఇంకేం చేస్తాడా వుద్యోగం! దానికి తోడు జీతమూ తక్కువే. వెయ్యి రూపాయలిస్తామన్నారుట. ఈ రోజుల్లో అడుక్కునే వాడూ కూడా అంతకంటే ఎక్కువే సంపాదిస్తున్నాడు. వాడికి పౌరుషం వచ్చి మానేసి చక్కా వచ్చాడు. అయిన వాళ్ళ పిల్లాడు కదా వాళ్ళ దగ్గరుంచుకుని వ్యాపారంలోని మెళకువలు అన్నీ నేర్పి వాటాదారుగా చేసుకోకూడదూ! రేపు వాళ్ళనంతరం వాడే అందిపుచ్చుకుంటాడు. ఆ మాత్రం ఇంగిత జ్ఞానం లేకపోయింది వాళ్ళకి. ఇప్పుడు బాగా అయింది" అంది ఒక ఇల్లాలు.

"నిజమే వదినా. మా అమ్మాయి పెళ్ళి కుదరగానే వెళ్ళి చెప్పాం. పెళ్ళికి రాలేం. ఢిల్లీ వెళుతున్నాం అంటూ రెండొందలో మూడొందలో ఖరీదు చేసే ఓ ముష్టి చీరె, ఓ లక్కపిడతంత వెండి కుంకుమ భరిణె ఇచ్చిందావిడ. ఓ అయిదొందలు ఇచ్చి అల్లుడికివ్వండి అంది. ఏం కట్టుకు పోతారా? పదివేలో పదిహేనువేలో చేతుల్లో పెట్టి ఖర్చులకుంచండి అనకూడదూ! పోన్లే పిసినారి బుద్ధులు అనుకున్నాం. మా బాధ ఏమిటీ అంటే, ఎవరి ద్వారానో మాకు తెలిసింది. ఆ తర్వాత పదిరోజులకే వాళ్ళ ఫ్యాక్టరీలో పనిచేసే అమ్మాయిని, అక్కడే పనిచేసే అబ్బాయికిచ్చి పెళ్ళి చేశారుట. సంసారానికి సరిపడా స్టీలు సామాన్లు, మంచం పరుపూ కొనిచ్చారుట. ఎంత హీనపక్షంగా చూసినా భోజనాలతో కలిసి ఇరవైవేల దాకా అయిందిట. అయినవారికి ఆకుల్లో కానివారికి కంచాల్లో అంటే ఇదే" అంది మరో ఇల్లాలు.

మరో చోట మరో చర్చ జరుగుతుంది.

"ఈ రంగశాయిగారిదంతా తలతిక్క వ్యవహారం. ఓసారి వాళ్ళింట్లో ఏదో శుభకార్యం అని పిలిచారు. బంధువులకి భోజనంతో బాటు పేదలకి అన్నదానం కూడా ఏర్పాటు చేశారుట. బంధువులకేమో పులిహోరా పూర్ణాలూ పరమాన్నం పెట్టి పంపించి పేదలకి మాత్రం పూరీ, కూర్మా, పలావూ, జాంగ్రీలూ ఐస్‌క్రీములూనట. పైగా అదేవిటంటే పేదలకి అవన్నీ ఎవరు పెడతారు? అని వితండవాదనట. ఆయనకి తాళం వేస్తూ ఆవిడొకత్తె. దొందూ దొందే" అన్నాడా పెద్దమనిషి.

"కోట్లకొద్దీ ఉంటే ఎన్నిదానాలైనా చెయ్యచ్చు. ఏముంది? లంక మేత గోదావరి ఈతా అన్నట్లూ ఆ ఫ్యాక్టరీ. ఓ స్వంత ఇల్లు అంతే. బ్యాంక్ బాలెన్సేం ఉండదు. ఉంటే మొగుడూ పెళ్ళాలకి తోచదు. ఏమిటో గాలివాటం వ్యవహారం. తెలివితక్కువ తనంగా ఏదో చేసి ఉంటాడు. అందుకే తనకి స్వంత తెలివి తేటలు లేకపోతే మరొకర్ని సలహా అడిగే అలవాటైనా ఉండాలి. నేనెన్నోసార్లు చెప్పాను వింటేనా!" అన్నాడు ఇంకో మేధావి.

ఈ సంగతి తెలిసి నిజంగా బాధపడినవాడు శేఖరం. అతనికీ రంగశాయిగారికీ బంధుత్వం ఉంది. నాలుగయిదుసార్లు రంగశాయిగారు శేఖరానికి సహాయం చేశారు.

ఫోన్ చేసి ఏమైందో కనుక్కుందాం అనుకున్నాడు. కానీ ఆ పని చెయ్యడానికి జంకు కలిగింది. రంగశాయిగారికి ఇంకొంత బాకీ తీర్చాలి. తన దగ్గర లేదు. తీరా ఇప్పుడు ఫోన్ చేసి ఆరా తీస్తే ఆయనగానీ "చూడు శేఖరం నాకూ ఇబ్బందిగా ఉంది నా బాకీ తీర్చు" అన్నాడంటే తను చిక్కుల్లో పడతాడు. కాబట్టి తెలిసినా తెలియనట్లు ఊరుకుంటే ఉత్తమం.

అదీగాక ఆయన తనకొక్కడికే కాదు చాలామందికి సాయం చేశాడు. ఎవరో ఒకరు ఆయన్ని ఆదుకోక పోరు ఊరుకున్నాడు.

మొత్తానికి రంగశాయి, శ్రీవాణిగార్ల గురించి ఆ వేళ చాలామందే మాట్లాడు కున్నారు.

సుజాత ప్రతిరోజూ పనిగట్టుకుని పద్మ సావిత్రిలను వెతికిపట్టుకుని "ఏమైంది ఇవ్వాళ మా శ్రీవాణి కనిపించిందా" అని అడుగుతుంది.

"ఇవ్వాళ కూడా కనిపించారు. అదే అవతారం. పాపం నడవలేక ఆయాస పడుతున్నారు" అని చెపుతున్నారు సావిత్రీ, పద్మ. ఆ వార్తని యధాశక్తి బంధువులకు చేరవేసి ఆనందపడుతుంది సుజాత.

సూర్యం ఒకసారి వాళ్ళ ఫ్యాక్టరీకి ఫోన్ చేశాడు. సార్ లేరు. ఎక్కడికో వెళ్ళారు. రావడానికి చాల్రోజులు పడుతుంది అని ముక్తసరిగా సమాధానం చెప్పారు. వివరాలడిగితే మాకేం తెలియవు అన్నారు.

ఇంటికి చేస్తే మీరు డయల్ చేసిన నెంబరుతో ప్రస్తుతం ఏ నెంబరూ పనిచేయడం లేదు అని సమాధానం వచ్చింది.

ఇంకేం వుంది ఫోను కూడా పీకేసుకుపోయుంటారు. ఏదో పెద్ద దెబ్బే తగిలింది. ఆయన మొహం చాటేశాడు. ఆ విషయమే సుజాతతో చెప్పాడు.

"కనీసం ఆవిడ ఉద్యోగం వున్నా బావుండేది. ఇటువంటి ఆపత్సమయంలో ఆదుకునేది. తీరి కూర్చుని ఉద్యోగం వదిలేసింది. తాదూరకంతలేదు మెడకో గంగడోలు అన్నట్లు ప్రజాసేవ సింగినాధం అంటూ చేతిచమురు వదిలించుకోవడం స్వంత వ్యాపారం వ్యాపారం అనగానే సరా! అన్నీ సమర్థించుకునే తెలివితేటలు ఉండొద్దూ. మనకు వ్యాపారాలు చేతకాకనే ఉద్యోగాలు చేస్తున్నామా? ఇప్పుడు పాపం రోడ్డున పడ్డిట్లు అయింది పని" అంది సుజాత.

ఇద్దరూ వాళ్ళ విషయమే మాట్లాడుకున్నారు.

ఆయన ఫ్యాక్టరీలో దొరకని విషయం వాళ్ళ ఇంటి ఫోను పీకేసిన విషయం కూడా నలుగురితో చెప్పి ఆనందించింది సుజాత. ఈ కారణంవల్ల బంధువుల్లో సుజాత చాలా ముఖ్యమైన వ్యక్తి అయిపోయింది. తెల్లవారిలేస్తే ఎవరో ఒకరు ఫోన్ చేసి "ఏమిటి సుజాతా? ఏమైందిట రంగశాయిగారి సంగతి? ఏమైనా కొత్త వివరాలు తెలిశాయా?" అని అడగడం.

వాళ్ళని నిరాశపరచడం ఎందుకని ఉన్నవీ లేనివీ కల్పించి చెప్పటం. అదో కాలక్షేపంగా మారింది సుజాతకి.

రాన్రాను ఉత్కంఠ పెరిగిపోయింది సుజాతకి. ఎలాగైనా శ్రీవాణిని కలిసి పూర్తి వివరాలు రాబట్టీ అవన్నీ బంధువులకీ చెప్పాలనే తహ తహ.

ఆ పని ఎలా చెయ్యాలా అని ఆలోచించి మంచి ప్లాను వేసుకుంది.

ఒకరోజు పొద్దున్నే లేచి ఆటో వేసుకుని ఆరుకిలోమీటర్లు ప్రయాణించి సావిత్రీ, పద్మ వాళ్ళు బస్సెక్కే స్టాప్‌కి వెళ్ళింది.

ఎవరికీ అనుమానం రాకూడదని బాగా ముందుగానే వెళ్ళి అక్కడే పచార్లు చేస్తూ గడిపింది. నిర్ణీత సమయానికి వచ్చారు పద్మ, సావిత్రి.

సుజాతను చూసి "ఇదేమిటండీ మీరిక్కడ?" అని అడిగారు ఆశ్చర్యంగా.

"నిన్న ఈ ఏరియాలో ఫ్రెండింట్లో ఫంక్షను జరిగింది రాత్రి బాగా ఆలస్యం అయింది. అందుకని ఇక్కడే ఉండిపోయాను ఇక్కడే బస్సెక్కుదామని వచ్చాను" అంది గోడకట్టినట్టు అబద్ధం చెపుతూ.

"మా శ్రీవాణి వచ్చేసిందా?" అంది యథాలాపంగా అడిగినట్లు.

"ఇంకా రాలేదండీ! రావాలి. ఒక్కోరోజు ఆవిడ ముందొస్తారు. ఒక్కోరోజు మన బస్ ముందు వస్తుంది" అంది సావిత్రి.

"దేవుడా! దేవుడా ఇవ్వాళ ఆవిడ ముందు రావాలి" అనుకుంది సుజాత. ఆవిడ కోరిక ఫలించింది.

"అరుగో శ్రీవాణిగారు" అంది పద్మ.

పద్మ, సావిత్రి ద్వారా ఎంత విని వున్నా శ్రీవాణిని చూసి గతుక్కుమంది సుజాత. మామూలు చీర, బోసిగా వున్న చెవులు, మెళ్ళో ఓ పసుపుతాడు. చేతికి రెండేసి మట్టి గాజులు. మనిషి బాగా నలిగిపోయింది. కొంచెం ఆయాసపడుతోంది.

సుజాత ఆశ్చర్యావస్థనుంచి బయటపడకముందే దగ్గరకొచ్చిన శ్రీవాణి పలుకరించింది.

"సుజాతా! నువ్వేమిటి ఇక్కడున్నావ్?" అంది ఆగిపోయి.

"నేనేదో పనుండి వచ్చానులే గానీ అక్కయ్యా నువ్వేమిటి ఇలా అయిపోయావ్? ఆరోగ్యం బాగా లేదా?" అంది సుజాత.

"బాగానే ఉన్నాను సుజాతా. మరి నేను వెళతాను. నాకు ఆలస్యం అవుతుంది" అంది శ్రీవాణి.

దొరికినట్లే దొరికి జారుకుంటున్న శ్రీవాణిని చూసి సుజాతకి చిరాకు వేసింది. ఆ మాత్రం తెలివితేటలు నాకూ వున్నాయి. ఈ అవకాశం జారవిడుచుకుంటానా అనుకుని.

"పద అక్కయ్యా! నేనూ వస్తాను" అంది.

"బస్సు వచ్చేస్తుందేమోనండీ" గుర్తు చేసింది పద్మ.

"నేను ఆటోలో వస్తానులెండి. చాలా రోజుల తర్వాత కనిపించింది మా అక్కయ్య. కాస్త కష్ట సుఖాలు మాట్లాడుకుంటాం" అనేసి శ్రీవాణితో బయలుదేరింది సుజాత.

"ఏమిటి విశేషాలు సుజాతా? బావా పిల్లలూ బావున్నారా?" ఆదరంగా అడిగింది శ్రీవాణి.

"ఆ! అందరం బాగానే ఉన్నాం అక్కయ్యా. నువ్వు చెప్పు ఏమిటి విశేషాలు?" అడిగింది సుజాత.

"మామూలు కబుర్లకేం గానీ సుజాతా ఈ మధ్య మేమంతా కలిసి ఒక మంచి పని చేశాం. కర్నాటకా బోర్డర్‌లో ఒక పల్లెటూళ్ళో పాపం ఎల్లమ్మ ఆచారానికి బలైపోయిన ఒక అమ్మాయిని ఆ చెరనుంచీ తప్పించి చేతి పనుల్లో శిక్షణ ఇప్పించాం. చీరల మీద వర్క్ చేసి రోజుకి ఓ వందరూపాయలదాకా సంపాదించుకుంటుంది. తల్లి తనాన్ని అనుభవించాలని ఆశపడుతోంది. బిడ్డను పెంచుకుంటానని చెప్పింది. తల్లీ తండ్రీ ఎయిడ్స్ వ్యాధితో మరణించగా అనాథగా మారిన ఆ అయిదేళ్ళ పాపని తీసుకుని ఈ అమ్మాయికి అప్పగించాం. బిడ్డకోసం తపిస్తున్న తల్లికి బిడ్డ దొరికింది. అనాథ పాపకు తల్లి దొరికింది. వాళ్ళని చూస్తుంటే మా కెంతో తృప్తిగా అనిపించింది. ఇటువంటి అనుభవాలు జీవితంలో ఎంతో తృప్తినిస్తాయి సుజాతా!" అంది శ్రీవాణి.

సుజాతకి విసుగేసింది. ఈ స్వంత డబ్బా చాల్లే తల్లీ అని మనసులో అనుకుని పైకి మాత్రం "ఆ మధ్య నీ కోసం ఇంటికి ఫోన్ చేస్తే, ఆ నెంబరుతో ఏ ఫోనూ లేదు పొమ్మన్నారు. ఫ్యాక్టరీకి చేస్తే బావగారు లేరు. ఎక్కడికి వెళ్ళారు? మీ ఫోనేమయింది?" అంది ఆరాగా.

"మాకు అమెరికన్ కంపెనీ నుంచీ మంచి ఆర్డర్ వచ్చింది సుజాతా! లాభాలు ఎలాగూ వస్తాయనుకో. మరో పదిమందికి ఉద్యోగాలు ఇవ్వగలమని ఆనందంగా

ఉంది. బావగారు ఆ పనిమీదే అమెరికా వెళ్ళారు. ఇంకో నెలాగి వస్తారు. ఇక ఫోనంటావా? పాతది తీసేసి ఈ మధ్య రిలయన్స్ ఫోన్ తీసుకున్నాం" అంది శ్రీవాణి.

గతుక్కుమంది సుజాత. "అలాగా చాలా సంతోషం. సరేగానీ అక్కయ్యా నువ్వేమిటి కాలినడకన వెళుతున్నావు. కారేమైంది? నగలన్నీ తీసేశావేం?" ఓర్పు నశించి పోయి నేరుగా పాయింట్లోకి వచ్చేసింది.

"అదా! ఈ మధ్య ఆరోగ్యం కాస్త పాడైంది సుజాతా! మెనోపాజ్ టైం కదా. నడుం నొప్పి దానికి తోడు ఉండుండి ఎడంకాలు గుంజడం. ఎవరో కేరళ వైద్యంతో తగ్గుతుందంటే ప్రయత్నించి చూద్దాం అని మొదలుపెట్టాను. పంచకర్మ చికిత్స. అయిదారు వారాలు. బాగానే వుంది. తైలమర్ధనాలు కదా. కాలి మట్టెలతో సహా అన్నీ తీసేయమంటారు. అక్కడికెళ్ళి తియ్యాలి కదా అని ఇంటి దగ్గరే తీసేస్తున్నాను. ఆ వైద్యానికి తోడు కాస్త వాకింగ్ కూడా ఉంటే ఈ ఒళ్ళు తగ్గుతుందని నడిచే వెళుతున్నాను. అన్నట్లు చెప్పడం మర్చిపోయాను. మా పెద్ద చెల్లెలు రాధ కూతురికి పురుడు వచ్చింది. ఒక్కతే ఉంది. కాస్త సాయంగా ఉండవే అక్కయ్యా అంది. అన్నీ కలిసొస్తాయి. ఇక్కడికి ఆ సెంటరు కూడా దగ్గర. ఎలాగూ బావగారు ఊళ్ళో లేరు. ఇక్కడే ఉండి ట్రీట్‌మెంట్ తీసుకుంటున్నాను. ఇదవగానే ఇంటికి వెళతాను" అంటూ విషయం చెప్పేసి "నేనిటు వెళ్ళాలి. అనుకోకుండా నిన్ను కలుసుకోవడం ఆనందంగా ఉంది. వీలు చూసుకుని మా ఇంటికి రా!" అని సందులోకి తిరిగింది శ్రీవాణి.

చేష్టలుడిగిన సుజాత మెల్లిగా వాస్తవంలోకి వచ్చింది. టైం అయిపోతుంది. బస్సుపట్టుకోవాలి. ఉరుకులు పరుగుల మీద బస్టాండుకి వెళ్ళింది. కానీ అప్పటికే బస్సులు వెళ్ళిపోయాయి. ఇంక ఆటోనే గతి.

అంతదూరం ఎవరూ రామన్నారు. రిటర్న్ ఫెయిర్ ఇమ్మన్నారు. కాసేపు అటూ ఇటూ పరుగులు పెట్టి గత్యంతరం లేక రెండొందలు తగలేసి ఆటో ఎక్కింది. ఆఫీసుకి వెళ్ళేసరికి గేటు మూసేశారు ఫార్మాలిటీస్ ముగించుకుని లోపలికి వెళ్ళేసరికి దాదాపు లంచ్ టైం కావస్తోంది. బాస్ ముక్క చీవాట్లు పెట్టాడు.

వికలమైపోయిన మనసుతో లంచ్ బాక్స్ తీసుకుని హాల్లోకి వెళ్ళింది అక్కడ ఎదురుగా సావిత్రి, పద్మ.

"ఏమైందిట శ్రీవాణిగారికి?" అని అడిగారు ముక్తకంఠంతో.

"నా శ్రాద్ధం అయింది. నా పిండాకూడయింది" విసురుగా చెప్పి కుర్చీలో కూలబడి అదృష్టవంతుల్ని చెడగొట్టేవాళ్ళు లేరు. దరిద్రుల్ని బాగుచేసే వాళ్ళూ లేరు" అనుకుంటూ కళ్ళ నీళ్ళు పెట్టుకుంది సుజాత.

*కౌముది, నవంబర్ 2008*